ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కర్ణాటక వార్తలు

శుక్రవారం 15 మార్చి 2024



తెలుగు రాష్ట్రాల మీదుగా ప్రత్యేక రైలు

బెంగళూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోళీ సందర్భంగా బెంగళూరు యశ్వంతపురం నుంచి ముజఫర్‌పూర్‌కు ప్రత్యేక వీక్లీ రైలును నడపనున్నారు. బెంగళూరు యశ్వంతపురంలో ఏప్రిల్ 1, 8 తేదీల్లో సోమవారం ఉదయం 7-30 గంటలకు బయల్దేరే ఈ రైలు ధర్మవరం, అనంతపురం, గుత్తి జంక్షన్, డోన్ జంక్షన్, కర్నూల్ సిటీ, గద్వాల్, మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, కాచిగూడ, జనగాంవ్, కాజీపేట జంక్షన్ , రామగుండం, సిర్పూర్ కాగజ్‌నగర్‌ల మీదుగా ప్రయాణించనుంది. ముజఫర్ పూర్‌లో ఈ రైలు మార్చి 29, ఏప్రిల్ 5 తేదీల్లో ప్రతి శుక్రవారం బయల్దేరుతుందని నైరుతి రైల్వే గురువారం ప్రకటించింది.



సీనియర్లు సీరియస్..!



- కమలదళంలో రగిలిన అసంతృప్తి
- టిక్కెట్లు రాని నేతల్లో ఆగ్రహం
- కొప్పళ ఆఫీసును ధ్వంసం చేసిన సంగణ్ణ అనుచరులు
- యడియూరప్ప మోసం చేశారు : ఈశ్వరప్ప
- అయోమయంలో శెట్టర్...

బెంగళూరు, మార్చి14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రెండో జాబితాపై సీనియర్లు భగ్గుమన్నారు. శిక్షణకు మారుపేరుగాను సిద్ధాంతాల లక్ష్యంగా వ్యవహరిస్తామని చెప్పుకునే రాష్ట్ర బీజేపీలోనూ అసంతృప్తి రగిలింది. రాష్ట్రంలోని 28 లోక్‌సభ నియోజకవర్గాల్లో బుధవారం 20 స్థానాలకు అభ్యర్థుల పేర్లను పార్టీ జాతీయ కమిటీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో సిట్టింగ్‌లతో పాటు టికెట్ నాకే దక్కుతుందనే ధీమాలో ఉండే సీనియర్‌లకు అధిష్టానం షాక్ ఇచ్చింది. దీంతో కొందరిలో అసంతృప్తి తారాస్థాయికి చేరగా గతంలో ఎన్నడూ లేని విధంగా కొప్పళ జిల్లా సిట్టింగ్ ఎంపీ కరడి సంగణ్ణ అనుచరులు ఏకంగా పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. కొప్పళలోని ఆఫీసు అద్దాలను పగులకొట్టారు. సంగణ్ణ కార్యాలయం వద్దకు వచ్చేసరికే వీరంగం జరిగిపోయింది. టికెట్‌లు ప్రకటించిన బుధవారం రాత్రి పెద్దఎత్తున సంగణ్ణ అనుచరులు పార్టీ పదాధికారులు కార్యాలయం వద్దకు తరలివచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి విజయానికే పార్టీకి చెందిన కొందరు కుట్రపన్నారని అందుకే సంగణ్ణకు టికెట్ రాకుండా చేశారని కార్యకర్తలు ధ్వజమెత్తారు. పార్టీ పదవులకు రాజీనామాలు చేస్తామని సవాల్ విసిరారు. గురువారం మరోసారి సంగణ్ణ అనుచరులు పెద్దఎత్తున కొప్పళలో నిరసన వ్యక్తం చేశారు. కానీ సంగణ్ణ మాత్రం పార్టీ నిర్ణయానికి కట్టుబడుతానని చెబుతున్నా అభిమానులు పట్టించుకోలేదు. పదేళ్లపాటు ఎంపీగా ప్రజాసేవ చేసేందుకు అవకాశం దక్కిందని గత ఎన్నికలలోను టికెట్ కోసం పలువురు ప్రయత్నించినా అధిష్టానం నన్ను బలపరచిందన్నారు. ప్రస్తుత ఎన్నికలలో టికెట్ రానందుకు తనకు అసంతృప్తి లేదని కానీ కార్యకర్తలకు ఉందన్నారు.



కొప్పళ బీజేపీ ఆఫీసుపై దాడికి దిగిన కార్యకర్తలు



అయోమయంలో జగదీష్ శెట్టర్...

లోక్‌సభ టికెట్‌ను ఆశిస్తున్న సీనియర్‌నేత జగదీష్ శెట్టర్ పరిస్థితి అయోమయంగా మారింది. ధారవాడ లేదా హావేరి నుంచి అభ్యర్థి కావాలని ఆయన భావించారు. అయితే ధారవాడ నుంచి మరోసారి కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషికే టికెట్ దక్కింది. హావేరి నుంచి మాజీ సీఎం బసవరాజ్‌బొమ్మై అభ్యర్థి అయ్యారు. శెట్టర్‌కు గత ఎమ్మెల్యే ఎన్నికలలో టికెట్ ఇవ్వలేమని అధిష్టానం తేల్చిన మేరకు రాత్రికి రాత్రి కాంగ్రెస్‌లో చేరారు. టికెట్ సాధించినా ఓటమి చెందారు. అయినా కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీని చేశారు. సజావుగా సాగుతున్న సందర్భంలోనే కాంగ్రెస్‌లో కొనసాగలేక బీజేపీకి వెనుదిరిగి వచ్చారు. ఆశించిన రెండుచోట్లా పేరు రాకపోవడంతో గందరగోళంలో పడ్డారు. చివరగా వియ్యంకురాలు మంగళ అంగడి ప్రాతినిథ్యం వహిస్తున్న బెళగావి టికెట్ దక్కవచ్చునని మరో జాబితా కోసం ఎదురు చూస్తున్నారు. అక్కడ దక్కలేదంటే ఇక శెట్టర్ భవిష్యత్ కోసం ఎటువంటి నిర్ణయం తీసుకుంటారనేది కీలకమవుతోంది.

యడియూరప్ప మోసం చేశారు..



సుదీర్ఘకాలం రాష్ట్ర రాజకీయాలలో తిరుగులేని నేతగా రాణించి ఫైర్ బ్రాండ్ అనిపించుకున్న ఈశ్వరప్పకు లోక్‌సభ ఎన్నికలలోను అవమానమే మిగిలింది. శాసనసభ ఎన్నికలకు ముందే అధిష్టానం టికెట్ ఇవ్వలేమని ప్రకటించిన మేరకు ప్రత్యక్ష రాజకీయాలకు ఈశ్వరప్ప గుడ్‌బై చెప్పారు. అయితే లోక్‌సభ ఎన్నికల ద్వారా కుమారుడు కాంతేష్‌కు హావేరి టికెట్ ఇప్పించేందుకు తీవ్ర కసరత్తు చేశారు. ఆయన సొంతజిల్లా శివమొగ్గలో సిట్టింగ్ ఎంపీ యడియూరప్ప కుమారుడు రాఘవేంద్ర ఉండటంతో హావేరి టికెట్‌కు ఈశ్వరప్ప ప్రయత్నించారు. కాంతేష్‌కు టికెట్ వస్తుందనే ఆశతో దాదాపు మూడునాలుగు నెలలుగా హావేరి జిల్లా వ్యాప్తంగా పర్యటించి సమాయత్తమయ్యారు. అనూహ్యంగా హావేరి నుంచి మాజీ సీఎం బసవరాజ్‌బొమ్మైకు టికెట్ వరించిడంతో ఈశ్వరప్ప ఒక్కసారిగా భగ్గుమన్నారు. యడియూరప్పతోనే తనకు అన్యాయం జరిగిందని బహిరంగంగా ప్రకటించారు. హావేరిని వదిలేస్తానని కానీ శివమొగ్గలో స్వతంత్ర్యంగా పోటీచేసే విషయం ఆలోచిస్తానన్నారు. అయితే వెంటనే పార్టీ అధిష్టానం రంగంలోకి దిగింది. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాధామోహన్ అగర్‌వాల్ నేరుగా ఈశ్వరప్పకు ఫోన్‌చేసి కాంతేష్‌కు ఎమ్మెల్సీ చేస్తామని వ్యతిరేకం దిశగా వెళ్ళరాదని సూచించారు. సంయమనం పాటించాలన్నారు.

దావణగెరెలో రేణుకాచార్య, తుమకూరులో మాధుస్వామి...

దావణగెరెలో సిద్దేశ్వర్ కుటుంబానికి టికెట్ ఇవ్వరాదని మాజీ మంత్రి, సీనియర్‌నేత రేణుకాచార్య బహిరంగంగానే డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని ఇటు రాష్ట్ర అటు జాతీయ నేతలకు వివరించారు. అయితే అనూహ్యంగా సిద్దేశ్వర్ భార్య గాయత్రికి టికెట్ దక్కడంతో రేణుకాచార్య తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇక తుమకూరు నుంచి మాజీ మంత్రి మాధుస్వామి ప్రయత్నాలు చేశారు. కానీ స్థానికేతరుడు అయిన మాజీ మంత్రి సోమణ్ణకు టికెట్ దక్కడంతో మాధుస్వామి నిరాశలో ఉన్నారు. ఉడుపి- చిక్కమగళూరు ఎంపీ కేంద్రమంత్రి శోభాకరంద్లాజేకు టికెట్ రాకుండా పార్టీ సీనియర్ సీటీ రవి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. శోభాకరంద్లాజెకు బెంగళూరు ఉత్తర టికెట్ దక్కింది. ఉడుపి- చిక్కమగళూరు టికెట్ విధానపరిషత్ ప్రతిపక్షనేత కోటా శ్రీనివాసపూజారికి వరించింది. టికెట్లు కోల్పోయిన వారిలో కేంద్రమాజీ మంత్రి సదానందగౌడ, పార్టీ అధ్యక్షులు నళిన్‌కుమార్ కటీల్‌లు సీనియర్ నేతలు. మైసూరు ఎంపీ ప్రతాప్‌సింహకు టికెట్ దక్కక పోవడంపై సోషల్ మీడియాలో బుధవారం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినా గురువారం ఎక్స్ ద్వారా స్పందిస్తూ టికెట్ పొందిన మహారాజ యదువీర్‌కు ధన్యవాదాలు తెలిపారు. దేశంకోసం మోదీ కోసం వెంటనే సిద్ధమవుదామని ప్రచారానికి దిగుదామని కోరారు. వయోభారం కారణంగా శ్రీనివాసప్రసాద్, దేవేంద్రప్ప, జీఎస్ బసవరాజు, కరడి సంగణ్ణలకు టికెట్‌లు దక్కలేదు. అనూహ్యంగా జీఎం సిద్దేశ్వర్‌కు బదులుగా ఆయన భార్యకు టికెట్ వరించింది. శివకుమార్ ఉదాసీ పోటీ చేసేది లేదని ప్రకటించడంతో ఆయనపై ఒత్తిడి లేదు. మిగిలిన ఎనిమిది నియోజక వర్గాల అభ్యర్థుల జాబితా కోసం ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది.





విధానసౌధలో..

భువనేశ్వరీ దేవి విగ్రహం

- నమ్మ మెట్రో మూడో విడత ప్రాజెక్టుకు అనుమతులు
- కేబినెట్‌లో పలు తీర్మానాలు

బెంగళూరు, మార్చి14 (ఆంధ్రజ్యోతి): కన్నడిగుల ఆరాధ్యం కన్నడ మాతగా పిలిచే భువనేశ్వరీదేవి విగ్రహాన్ని విధానసౌధ ప్రాంగణంలో ఏర్పాటు చేసేలా మంత్రివర్గం తీర్మానించింది. గురువారం సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీ తీర్మానాలను రెవిన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ మీడియాకు వివరించారు. అద్భుతమైన విగ్రహాన్ని తీర్చేందుకు రూ. 23కోట్ల రూపాయలు కేటాయించారు. నమ్మ మెట్రో మూడో విడత ప్రాజెక్టుకు పాలనాపరమైన అనుమతులకు ఆమోదించారు. బెంగళూరు తూర్పు భాగంలో ట్రీపార్క్‌ను స్థాపించదలచారు. కేఆర్ పురం తాలూకా పరిధిలోని ఎన్‌జీఈఎఫ్ సంస్థ 65 ఎకరాల విస్తీర్ణంలో ట్రీ పార్కును నిర్మించేందుకు అమోదించారు. వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లతో పాటు మరిన్ని సౌలభ్యాలు కల్పించదలచారు. లాల్‌బాగ్, కబ్బన్‌పార్క్‌ల తరహాలో అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. కళ్యాణకర్ణాటక పరిధిలోని 7తాలూకాలకు 33 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు రూ.132 కోట్లు మంజూరు చేశారు. బెంగళూరులోని ప్యాలెస్ మైదానం పరిధిలో రోడ్డు విస్తరణ కోర్టు పరిధిలో ఉన్నందున పరిష్కరించి నిర్మాణాలు చేపట్టేందుకు తీర్మానించారు. ఇంటి పట్టాలు మంజూరు చేసిన మూడు నెలల వ్యవధిలోనే నిర్మాణాలు చేపట్టేలా నిర్ణయించారు. లీజ్ కం సేల్ విధానంతో మూడునెలల లోపుగానే డిపాజిట్‌లు జమచేసేలా నిర్ణయించారు. వీటితో పాటు పలు జిల్లాల అభివృద్ధి పనులకు కేబినెట్ ఆమోదిస్తూ తీర్మానించింది.

రికార్డు ధర పలికిన పసుపు కొమ్ములు

- చామరాజనగర్‌లో క్వింటం రూ.19వేల పైనే..



ఇఫ్తార్	: శుక్రవారం సాయంత్రం	06:31
సెహరి	: శనివారం ఉదయం	05:12

బెంగళూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చామరాజనగర్ జిల్లాలో పసుపు కొమ్ములకు రికార్డు ధర పలుకుతోంది. ఇక్కడ పండే పసుపుకు తమిళనాడులోని ఈరోడ్ మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉంది. ఈ నెల ప్రారంభంలో రూ 13వేల ధర పలికిన పసుపు కొమ్ముల ధర కేవలం పదిరోజుల అవ ధిలోనే ఏకంగా రూ.6వేలు పెరుగడం విశేషం. జిల్లాలో గత ఏడాది 8,200 హెక్టార్ల ప్రదేశంలో రైతులు పసుపు పంట వేశారు. ప్రస్తుత కోతల సీజన్ ప్రారంభంలోనే ధర భారీగా ఉండటంతో పసుపు రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. గత ఏడాది చీడల కారణంగా పసుపు పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. అందుకే రైతులు ఈ సారి పసుపుపంట వేసేందుకు భయపడ్డారు. కాస్త ధైర్యంగా పసుపు పంట వేసిన రైతుల మోము వికసిస్తోంది. 2010 తర్వాత జిల్లాలో పసుపు అత్యధిక ధర లభిస్తుండటం సంతోషంగా ఉందని గుండ్లు పేట పసుపు మార్కెట్‌లో రైతులు పేర్కొంటున్నారు. 2018లో క్వింటాల్ పసుపు ధర గరిష్టంగా రూ.18వేల ధర పలికిందని 2011 లో ఇది ఏకంగా క్వింటాల్ ధర రూ.3వేలకు పడిపోయిందని రైతులు అంటున్నారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం తొలిసారి జోక్యం చేసుకుని పసుపుకు మద్దతు ధరను ప్రకటించి క్వింటాల్ రూ 5వేల చొప్పున కొనుగోలు చేసిందని గుర్తుచేసుకున్నారు. ఇక్కడి నాణ్యమైన కొమ్ము పసుపును కొనుగోలు చేసేందుకు తమిళనాడు, కేరళ రాష్ట్రాల వర్తకులు పెద్ద సం ఖ్యలో వస్తుంటారు. దీనికి ప్రత్యేక గుర్తింపు ఉంది.



కాల్పుల కలకలం..



- పట్టపగలే బంగారు దుకాణంలో చోరీకి యత్నం
- యజమానులపై తుపాకీతో కాల్పులు
- కేకలు వేయడంతో పరుగులు తీసిన దుండగులు

బెంగళూరు, మార్చి14 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగర నడిబొడ్డున పట్టపగలు బంగారు దుకాణంపై నలుగురు అగంతకులు చోరీకి యత్నించి ఏకంగా సంబంధిత యజమానులపై తుపాకీతో కాల్పులు జరిపారు. కొడిగేహళ్ళి దేవీనగర్‌లోని లక్ష్మీ బ్యాంకర్స్ అండ్ జ్యూవెల్స్ దుకాణానికి గురువారం ఉదయం 11గంటలకు నలుగురు వ్యక్తులు హెల్మెట్‌లు, ముఖానికి గుడ్డలు కట్టుకుని వచ్చారు. ఇద్దరు లోపలికి ప్రవేశించగా మరో ఇద్దరు ప్రధాన ద్వారానికి అడ్డుగా నిలబడ్డారు. వెంటనే తుపాకులు చూపించి బంగారం చోరీ చేసేందుకు ప్రయత్నించారు. అంతలోనే షాప్ యజమానులు ఆపూరామ్, అందరామ్‌లపై తుపాకీతో కాల్పులు జరిపారు. ఒకరికి పొట్టలోను మరొకరికి కాలికి బుల్లెట్ గాయాలు అయ్యాయి. ఒక్కసారిగా వారు కేకలు వేయడంతో భయపడిన దొంగలు హడావుడిగా బయటపడే ప్రయత్నం చేశారు. అంతలోనే ఓ తుపాకీని అక్కడే వదిలి వెళ్ళిపోయారు. కాసేపటికి గమనించిన ఇతర దుకాణదారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారిని ఆసుపత్రికి తరలించారు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితులను గుర్తించే కార్యాచరణ చేపట్టారు. సంఘటనా స్థలానికి డీజీపీ అలోక్‌మోహన్, నగర పోలీస్ కమిషనర్ దయానంద్‌లు చేరుకుని పరిశీలించారు. నిందితులు నాలుగు రౌండ్‌లు కాల్పులు జరిపినట్లు గుర్తించినట్లు డీజీపీ అలోక్‌మోహన్ మీడియాకు తెలిపారు. వెంటనే పలు ప్రాంతాలలో నాకాబందీ ద్వారా నిందితుల కోసం గాలింపులు జరిపారు. అయితే ఆనవాళ్ళు లభించలేదు. చోరీ కోసమే వచ్చారా లేక హత్య చేసే కుట్ర ఏదైనా ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



ముసుగుతో వచ్చి కాల్పులు జరిపిన వ్యక్తి

విషనాగుల నేస్తం..



అత్యంత విషపూరిత కోడెనాగుతో విద్య

- 8 వేల పాముల్ని సంరక్షించిన విద్యా విజయ్ టిక్మేకర
- అందులో మూడొంతులు అత్యంత విషపూరితమే
- ప్రతిఫలం ఏమీ వద్దు.. పర్యావరణ హితమే.. అంటున్న మహిళ
- తన ఇద్దరు పిల్లలకు అందులోనే శిక్షణ ఇస్తున్న వైనం

బెంగళూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అతివలు అన్నిరంగాల్లోనూ అద్భుతంగా రాణిస్తున్నారు. అయితే ధైర్యసాహసాలలోనూ ఎవ్వరికీ తక్కువ కాదని నిరూపిస్తున్నారు. రాచనగరి మైసూరుకు చెందిన 36 సంవత్సరాల విద్యా విజయ్ టిక్మేకర మాత్రం అత్యంత ప్రమాదకరమైన సేవా వృత్తిని ఎంచుకుని అందులో సత్తా చాటుకుంటోంది. మైసూరు ప్రజలు మధు అంటూ ఎంతో ఇష్టంగా పిలుచుకునే విద్యా గత 17 సంవత్సరాల్లో ఏకంగా 8వేల పాములను సంరక్షించింది. బెళగావికి చెందిన విద్యా కుటుంబం గత మూడేళ్ళ క్రిందట మైసూరులో స్థిరపడింది. అత్యంత విషపూరిత నాగుపాములు, కింగ్ కోబ్రాలను మెలకువగా పట్టుకుని వాటిని సురక్షితంగా అడవుల్లో వదిలేసింది. పాములను చాకచక్యంగా పట్టుకోవడంతో బెళగావిలోనే విద్యా శిక్షణ పొందింది. పాము కనిపించినట్లు ఫోన్ కాల్‌రాగానే ఒక చిన్నకర్ర, సంచీతో తన మోటార్ సైకిల్‌పై బయల్దేరి వెళ్ళే విద్యా బెళగావిలో ఉన్న సమయంలో ఒకే రోజు 15 విషపూరిత పాములను పట్టిరికార్డు సృష్టించింది. తన తాత పర్యావరణ ప్రేమికుడైన బాబూరావ్ టిక్మేకర్‌తో స్ఫూర్తి పొందానని విద్యా వెల్లడించింది. పాముల్ని పట్టేందుకు పలుసార్లుచెట్లు, ఇళ్ళపైకప్పులు ఎక్కానని చెప్పింది. పామును చూడగానే ప్రజలు భయంతో వాటిని చంపేందుకు ప్రయత్నిస్తారని ఇది మంచిది కాదని పేర్కొంది. పాములు ఆత్మరక్షణ కోసమేకాటు వేస్తాయే తప్ప సహజంగా ఎవరికీ హాని చేయవని పేర్కొంది. పర్యావరణాన్ని కాపాడి, అన్ని జీవులను బతికేలా చేయడం మనుషులందరి బాధ్యత అంటోంది. మైసూరులోనూ తనకు రోజూ 25 వరకు ఫోన్‌కాల్స్ వస్తుంటాయని సాధ్యమైనంతవరకు అన్నింటినీ అటెండ్‌చేస్తుంటానని అయితే ఎక్కడా ప్రతిఫలం ఆశించనని చెప్పింది. పర్యావరణ సంరక్షణకు ఈ రూపంలో సేవలందిస్తుండటం తనకు ఎంతో సంతృప్తిగా ఉందని తెలిపింది. పాములను సురక్షితంగా ఎలా పట్టుకోవాలనే అంశంపై తన ఇద్దరు పిల్లలకు కూడా విద్యా శిక్షణనిస్తుండటం విశేషం.

యలహంకలో నందనప్యాలెస్ శాఖ ప్రారంభం

- నాణ్యతతోనే బ్రాండ్ ఇమేజ్ : ఎమ్మెల్యే విశ్వనాథ్ ప్రశంసలు

బెంగళూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రశైలి శాఖాహార, మాంసాహార వంటలతో ఆహార ప్రియులను అమితంగా ఆకట్టుకుంటున్న నందన ప్యాలెస్ బెంగళూరు యలహంకలో తన నూతన రెస్టారెంట్ శాఖను ఏర్పాటు చేసింది. ఈ రెస్టారెంట్‌ను యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్ గురువారం లాంచనంగా ప్రారంభించారు. నాణ్యత రుచులతోనే బ్రాండ్ ఇమేజ్ వస్తుందని పేర్కొన్న ఎమ్మెల్యే ఈ సందర్భంగా నందన ప్యాలెస్ రెస్టారెంట్ల అధినేత డాక్టర్.రవిచందర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. నందన గ్రూప్ హోటళ్ళ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డా.రవిచందర్ మాట్లాడుతూ 1989 నుంచి హోటల్ పరిశ్రమ రంగంలో ఉన్నామని యలహంకతో కలిపి తమ శాఖల సంఖ్య 24కు చేరుకుందన్నారు. నందన ప్యాలెస్ లో మటన్ పెప్పర్ ఫ్రై, ఘీ రోస్ట్, ప్రాన్స్ ఫ్రై, చికెన్ బిరియానీ వంటివి బహుళ ప్రజాదరణ పొందాయన్నారు. ఖాతాదారుల అభిరుచులకు అనుగుణంగానే రకరకాల విభిన్న శైలి పదార్థాలను అందిస్తున్నామన్నారు. నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీపడకపోవడం వల్లే తమకు ఇంత బ్రాండ్ ఇమేజ్ వచ్చిందని భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంగీత మొబైల్స్ చైర్మన్ సుభాష్ చంద్ర, నగర మాజీ ఉప మేయర్ సీఆర్.రామమోహన్ రాజు, పారిశ్రామిక వేత్త ఎస్.పవిత్ర, హెచ్.శ్రీనివాసరెడ్డి, వివిఎస్.ప్రకాష్ తదితరులు పాల్గొని నందన ప్యాలెస్ హోటళ్ళ అధినేత డాక్టర్. రవిచందర్‌కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో ప్రముఖులు


నీటిని పొదుపుగా వాడుదాం

- కరువు పరిస్థితిని ప్రజలు అర్థం చేసుకోవాలి : డీకే
- నీరు ఉళిసి- బెంగళూరు బెళసి అభియానకు డీసీఎం శ్రీకారం

బెంగళూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కరువు పరిస్థితి దృష్ట్యా నీటిని పొదుపుగా వాడుకోవడం ద్వారా నగర ప్రజలు తమ బాధ్యతను నిర్వర్తించాలని ఉప ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ పిలుపునిచ్చారు. విధానసౌధ ప్రాంగణంలో గురువారం ఆయన తాగునీటి సంరక్షణపై ప్రజలను జాగృత పరిచే ఉద్దేశంతో నీరు ఉళిసి - బెంగళూరు బెళసి అభియానకు పచ్చజెండా చూపారు. ఇదే సందర్భంగా ఆయన అంతర్జల, జలసంరక్షక, జల మిత్ర, జలస్నేహి యాప్‌లను విడుదల చేశారు. వర్షాభావ పరిస్థితి కారణంగా బావులు, చెరువులు ఇంకిపోయి నగరానికి తాగునీటి సమస్య ఏర్పడిందని డీకే పేర్కొన్నారు. నగర పరిధిలో 6900 బావులు పూర్తిగా ఇంకిపోగా, మిగిలిన 7 బావుల్లోనూ నీటి ప్రమాణం పూర్తిగా అడుగంటిందన్నారు. అందుకే తాగునీటి సంరక్షణపై ప్రజలను జాగృత పరుస్తున్నామన్నారు. కావేరి నీటి పంపిణీ జరుగుతున్న నగర ప్రదేశాలలో ఎలాంటి సమస్యా లేదని బోరు బావులు అధికంగా ఉన్న ప్రాంతాల్లోనే సమస్య తీవ్రంగా ఉందని ఆయన వివ రించారు. ఇకపై నగరంలో ఎక్కడ బోరు బావి తవ్వాలన్నా జలమండలి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. నగరంలో గత దశాబ్దకాలంగా నీటి చార్జీలను పెంచలేదని ఆయన వివరించారు. నగర నీటి సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటున్నామన్నారు. నగర తాగునీటి సమస్య విషయంలో బీజేపీ నీచ రాజకీయం చేస్తోందని ఆయన మండిపడ్డారు. తమిళనాడుకు కావేరి జలాలు విడుదల చేయడం వల్లే నగరానికి నీటి సమస్య ఏర్పడిందంటూ బీజేపీ నేతలు అసత్యాలను ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీకి నగర ప్రజల తాగునీటి సమస్యపై నిజంగానే ఆసక్తి ఉంటే తక్షణం మేకెదాటు పథకానికి అనుమతి మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వ గ్యారెంటీ పథకాలకు లభిస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక అసూయతోనే బీజేపీ పచ్చి అబద్ధాలను ప్రచారంచేస్తోందని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై బీజేపీ దృష్టి పెట్టాలన్నారు.



ప్రచార అభియానకు పచ్చజెండా చూపుతున్న డీకే



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,583.65	1,598.29
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	2,060	8,491
సామర్థ్యం (టీఎంసీలు)	6.48	19.40

ఘనంగా కార్ల్‌మార్క్స్ వర్ధంతి



మార్క్స్‌కు నివాళులర్పిస్తున్న ఎస్‌యూసీఐ ప్రముఖులు

బళ్లారి సిటీ, మార్చి 14: 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి' అని పిలుపునిచ్చిన గొప్ప తత్వవేత్త కామ్రేడ్ కార్ల్ మార్క్స్ 141వ వర్ధంతిని ఎస్‌యూసీఐ కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆ పార్టీ జిల్లాకమిటీ సభ్యుడు కామ్రేడ్ ఏ.దేవదాస్ కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలవేసి అనంతరం మాట్లాడారు. మార్క్స్ అత్యంత బాధాకరమైన తన జీవితంలో శ్రామికవర్గ ఆనందంలోనే తాను సంతోషాన్ని పొందేవాడన్నారు. ఎక్కువ మందికి ఆనందాన్నిచ్చే వ్యక్తి అత్యంత శాంతిని అనుభవిస్తాడని ఆయన చెప్పిన మాటలే అత్యంత స్ఫూర్తిదాయకమైనవన్నారు. కార్ల్ మార్క్స్ జీవిత పోరాటం, ఆయన దార్శనికత పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీ చక్రంలో చిక్కుకున్న శ్రామిక వర్గానికి ఇప్పటికీ ఒక దీపస్తంభంగా ఉన్నాయన్నారు. రష్యాలో మార్క్సిజం తొలిసారి విజయం సాధించి కార్మికవర్గ విప్లవం ద్వారా ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. భారత గడ్డపై ఆయన ఆలోచనల ఆధారంగా స్థాపించబడిన ఎస్‌యూసీఐ కమ్యూనిస్ట్ పార్టీ పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసి సోషలిస్టు వ్యవస్థను తీసుకురావడానికి కృషిచేస్తుందన్నారు. ఈసందర్భంగా ప్రమోద్, జిల్లాకమిటీసభ్యులు గోవింద్, ఎం.శాంత, ఈశ్వరీ, రాజా, జగదీశ్, విజయలక్ష్మి, రవికిరణ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ కేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ప్రభంజన్, గోవిందరాజులు

బళ్లారిరూరల్, మార్చి 14 : బళ్లారి నగరం గ్రహణం రోడ్డులో షిర్డీసాయి సేవ సత్సంగ్ ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రభంజన్ కుమార్, గోవిందరాజులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్పొరేటర్ ప్రభంజన్ కుమార్ మాట్లాడుతూ వేసవిలో ఎండలు మండుతున్న సందర్భంగా ప్రజలు దాహం తీర్చుకునేందుకు 90 రోజుల పాటు నీరు, మజ్జిగ అందించే కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో శ్రీ షిర్డీ సాయి సేవా సత్సంగం అధ్యక్షులు ఆర్ గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు కేహెచ్ రమేష్, గిరిధర్, సత్సంగ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, మార్చి 14 : ఏపీఎంసీ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజు గురువారం భూమిపూజ చేశారు. సిరుగుప్ప పట్టణం జీహెచ్‌ఎంసీ ప్రాంగణంలో రూ. 50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టారు. నాణ్యతగా పనులు చేయాలని ఇంజనీర్లను కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంజునాథరెడ్డి, ఏపీఎంసీ మాజీ అధ్యక్షులు రామస్వామి షావుకారు తదితరులు పాల్గొన్నారు.

బైక్-లారీ ఢీ.. యువకుడి దుర్మరణం

రాయచూరు, మార్చి 14 : సింధనూరు తాలూకా సాసలమరి క్యాంపు నుంచి బైక్‌పై బుధవారం రాత్రి శ్రీపురం జంక్షన్‌కు వెళుతున్న యువకుడు రవి(25)ని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవి అక్కడికక్కడే మృత్యువాత పడగా బైక్ వెనక కూర్చున్న మంజునాథ్(27) తీవ్ర గాయాలపాలయ్యాడు. సింధనూరు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదంపై దర్యాప్తు చేపట్టారు.

నా అజ్ఞాతవాసం ముగిసింది / బీజేపీ బళ్లారి ఎంపీ అభ్యర్థి శ్రీరాములు

బళ్లారి సిటీ, మార్చి 14: గత అసెంబ్లీ ఎన్నికల్లో బళ్లారి రూరల్ నియోజకవర్గంలో తనను ఓడించి రాజకీయ సందిగ్ధంలోకి నెట్టారని, ప్రస్తుతం లోక్‌సభకు పోటీ చేసేందుకు బళ్లారి బీజేపీ టికెట్ ఇవ్వడంతో ఇప్పుడు అజ్ఞాతం వీడిందని మాజీ మంత్రి బి.శ్రీరాములు అన్నారు. నగరంలోని తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోసపూరిత రాజకీయాలు చేసిన వారికి ఈ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ప్రత్యర్థులు చిక్కుల్లో కూరుకుపోతారన్న విషయాన్ని మన కార్యకర్తలు బోధిస్తారన్నారు. ఇప్పుడు దేశంలోని పలు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రావాలని నిర్ణయించుకుందని, ఎన్డీయే 400కి పైగా సీట్లు గెలుసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. పదేళ్ల మోదీ పాలనలో మూడోసారి ప్రజల ఆదరణ ఎక్కువగా ఉంటుందన్నారు. ఒక ఉప ఎన్నిక మినహా 2004 నుంచి బళ్లారి లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థులు గెలుపొందారన్నారు. తనను ఓడించడం ఎవరి చేతుల్లో లేదని, ప్రజాశక్తి ముందు ప్రత్యర్థుల కోరిక నెరవేరదని ధీమా వ్యక్తం చేశారు. మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు వస్తే లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించి నరేంద్ర మోదీతో కలిసి పనిచేస్తానన్నారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ మహిపాల్, కేఏ.రామలింగప్ప, గోనాల్ మురహరిగౌడ, హెచ్.హనుమంతప్ప, డాక్టర్ అరుణకామినేని, రూర్‌బాషా, గణపాల్ ఐనాథ్‌రెడ్డి, పాలన్న, ఇబ్రహీంబాబు, సురేఖ మల్లనగౌడ, హనుమంతప్ప, ఓబలేశు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్నమాజీ మంత్రి శ్రీరాములు

ఓటు.. దేశ భవితవ్యాన్ని మారుస్తుంది

● జిల్లాపంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప

బళ్లారి సిటీ, మార్చి 14: ప్రతి ఒక్క ఓటు దేశ భవిష్యత్తును మారుస్తుందని జిల్లా నోడల్ అధికారి, జిల్లాపంచాయితీ సీఈఓ రాహుల్ శరణప్ప అన్నారు. నెహ్రూ యువకేంద్రం, బళ్లారి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ప్రాంగణంలో గురువారం జరిగిన యువజన పార్లమెంట్-2024 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలకంటే పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల సంఖ్య తక్కువగా ఉందని, కనీస వసతులైన నీరు, మరుగుకాలువలు, రోడ్లు, విద్యుత్ తదితర సమస్యలపై దృష్టి సారించాలని, వాటిని సముచితంగా పరిష్కరించేందుకు నేటి యువత తప్పకుండా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఓటు వేయడం మన హక్కుఅని, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటు వేయాలని కోరారు. బళ్లారి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల డైరెక్టర్ పృథ్వీరాజ్ భూపాల్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ఓటు అనేది ప్రజల కోసమని ప్రతి విద్యార్థి తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. నెహ్రూ యువజన కేంద్రం జిల్లా యువజన అధికారి పత్తార్ విద్యార్థుల చేత ఎన్నికల ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో జిల్లాపారిశ్రామిక కేంద్ర సంయుక్త సంచాలకులు సోమశేఖర్ విద్యార్థులకు ఎన్నికల వ్యవస్థపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.యడవల్లి బసవరాజ్, ప్రోగ్రాం అధికారి అశోక్, షేక్మీరా, కమల్ కిశోర్, అక్కీరెడ్డి, అమరేశ్, బెంజమిన్, బిసలహళ్ళి బసవరాజ్, డాక్టర్ వీణా, ఇతర ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఈఓ రాహుల్ శరణప్ప

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

బళ్లారి సిటీ, మార్చి 14: మొక్కజొన్న, మినుము తదితర వాటిని ఎంఎస్‌పీ పథకం కింద వెంటనే కొనుగోలు చేయాలని ఏఐకేకేఎంఎస్ రైతుసంఘం డిమాండ్ చేస్తూ తహసీల్దార్ గౌసియా బేగంకు గురువారం వినతి పత్రాన్ని సమర్పించింది. ఈసందర్భంగా సంఘం జిల్లాధ్యక్షుడు గోవింద్ మాట్లాడుతూ రాష్ట్రంలో కనీస ధర(ఎంఎస్‌పీ)పథకం కింద రైతుల నుంచి వరి, మినుము, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియకు ఇంకా 15రోజుల సమయం మాత్రమే ఉందని, ఇప్పటి వరకు రాష్ట్రంలో కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభం కాలేదన్నారు. దీంతో లక్షలాది మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఈసారి ఎంఎస్‌పీ పథకం కింద 5.99లక్షల టన్నుల మినుము, 2.5లక్షల టన్నుల వరి, 3లక్షల టన్నుల తెల్లమొక్కజొన్న కొనుగోలుకు నవంబర్ 2023లో అంగీకారం కుదిరిందన్నారు. ఎంఎస్‌పీ పథకం కింద ఆహార ధాన్యాలు విక్రయించేందుకు నమోదు చేసుకున్న రైతులు కొనుగోలు ప్రారంభం కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయంపై ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో కురుగోడు తాలూకా అధ్యక్షుడు లింగప్ప, బళ్లారి తాలూకా కార్యదర్శి ధనరాజ్, జిల్లాకమిటీ సభ్యులు హొన్నూరప్ప,దస్తగిరి,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్నరైతు సంఘం నాయకులు

బీజేపీ కొప్పళ అభ్యర్థి బసవరాజును గెలిపించుకుందాం

సిరుగుప్ప, మార్చి 14 : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కొప్పళ బీజేపీ అభ్యర్థి డాక్టర్ బసవరాజు పేరు ఖరారైనట్లు బీజేపీ మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప తెలిపారు. సిరుగుప్ప పట్టణంలో గురువారం బీజేపీ కార్యాలయంలో లోక్‌సభ ఎన్నికలు ఎదుర్కోవడంపై ఏర్పాట్లకు సంబంధించిన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ కొప్పళ లోక్‌సభ అభ్యర్థిగా డాక్టర్ బసవరాజు పేరును ప్రకటించినట్లు ఆయన తెలిపారు. కావున కార్యకర్తలు ప్రతి ఇంటింటికి తిరిగి ఆయన గెలుపునకు కృషి చేయాలని కోరారు. దేశ ప్రధానిగా నరేంద్రమోడీ అధికార పగ్గాలు చేపట్టాలంటే కార్యకర్తల కృషి ఎంతో అవసరమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ తాలుకా అధ్యక్షుడు కుంటనహాళ్ మల్లికార్జున స్వామి, ఉపాధ్యక్షులు కంప్లి మల్లికార్జున, జిల్లా ఉపాధ్యక్షులు గాలి శంకరప్ప, ప్రధాన కార్యదర్శి గలగల బసవరాజు, పక్కీరయ్య, అధ్యక్షులు నాగరాజు, నగర అధ్యక్షులు విక్రమ్ కుమార్ జైన్, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

ఉలిగమ్మ భక్తుల కోసం నీటిని విడుదల చేయాలి



పుష్పాలంకరణలో ఉలిగమ్మ తల్లి

కంప్లి, మార్చి 14 : కొప్పళ జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఉలిగమ్మ దేవాలయానికి వచ్చే వారికి అవసరమైన నీటిని విడుదల చేయాలని భక్తులు కోరుతున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారని, కానీ ఇక్కడ నదిలో మురుగునీరు వుండటం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అమావాస్య, పౌర్ణమి, మంగళ, శుక్రవారాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షలాది మంది బస్సులు, రైళ్ల ద్వారా వచ్చి మొక్కులు సమర్పించుకుంటున్నారన్నారు. కానీ నదిలో స్నానాలు చేసేందుకు నీరు లేకపోవడంతో భక్తులు వెనుకంజ వేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు ముందుకొచ్చి టీబీడ్యాం నుంచి నీటిని విడుదల చేయాలన్నారు. కనీసం నది ఒడ్డున బోర్లు ఏర్పాటుచేసి జల్లు స్నానాలకైనా ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.



మురుగునీటిలోనే స్నానం చేస్తున్న భక్తులు

కాంగ్రెస్ విజయానికి నాంది పలుకుదాం

ఎవరిని నిలబెట్టినా భారీ మెజార్టీతో గెలిపిస్తాం: ఎమ్మెల్యే గణేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, మార్చి 14 : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టినా భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. గురువారం మెట్రి గ్రామ పంచాయతీ పరిధిలోని ఉప్పరహళ్లి, చిన్నాపుర గ్రామాల తాగునీటిపైపులైన్ పనులకు ఆయన భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలో కొన్ని చెరువులను భర్తీ చేసామని, మిగిలిన చెరువులను కూడా త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. జిల్లాలో ఇప్పటికే ఎంపీగా పోటీ చేసేందుకు ఉగ్రప్ప, వెంకటేష్ ప్రసాద్, చైత్ర తుకారామ్, నాగరాజులు పోటీపడుతున్నట్లు తెలిపారు. ఈ నలుగురిలో హైకమాండ్ ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టినా జిల్లాలోనే తమ నియోజకవర్గం నుంచి అధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు. మరో మూడు రోజుల్లో ఎన్నికల కోడ్ వెలువడుతుందని, కాంగ్రెస్ పార్టీ నాయకుడి గెలుపుకు నాయకులు, కార్యకర్తలు మనస్పర్థలు వదిలి ముందడుగు వేయాలన్నారు. అనంతరం చిన్నాపురంలో స్మశానవాటిక అభివృద్ధి విషయంపై గ్రామస్థులతో చర్చించారు. త్వరలోనే ఈ స్మశాన వాటిక అభివృద్ధి చేపడతామని తెలిపారు. వారితో పాటు గిరి, శంకరప్ప, నాగరాజు, రామాంజి, పరమేష్, గాదెలింగ, తదితరులు పాల్గొన్నారు.

బోరు నీటి వృథా.. నిర్లక్ష్యం వీడని అధికారులు



కంప్లి 7వ వార్డులో బోరు ద్వారా వృథా అవుతున్న నీరు

కంప్లి, మార్చి 14 : కుడితిని పట్టణంలో బోర్లలో నీరు వృథా అవుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఏడవ వార్డులో మోటారు నుంచి ఎల్లప్పుడూ నీరువృథా అవుతోంది. దీనిపై ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ఇంతవరకు పట్టించుకోలేదని బసవరాజు అనే స్థానికుడు తెలిపాడు. రోజు రోజుకు పట్టణంలో నీటి సమస్య తీవ్రమవుతూ వుంది. ఇప్పటికే వారానికొకరోజు మాత్రమే నీరు సరఫరా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి బోర్ల నుంచి నీరు వృథా కాకుండా ట్యాంకును ఏర్పాటు చేసి అక్కడి నుంచి వార్డులోని ప్రజలకు అందేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

26 ఏళ్లుగా బాటసారుల దాహార్తిని తీరుస్తున్న తిప్పన్న



షుగర్ ఫ్యాక్టరీ వద్ద చలివేంద్రంలో బాటసారులకు నీరు అందిస్తున్న తిప్పన్న

కంప్లి, మార్చి 14 : మండుటెండలో రోడ్లపై వెళుతున్న బాటసారుల దాహార్తిని వాల్మీకి సమాజానికి చెందిన 55 సంవత్సరాల తిప్పన్న గత 26 సంవత్సరాలుగా తీర్చుతున్నాడు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చలివేంద్రం పేరుతో కంప్లి పట్టణానికి వచ్చే బాటసారులకు నీటిని అందిస్తున్నాడు. ఆయన ప్రతినిత్యం 2 కిలోమీటర్ల దూరం నుంచి మంచినీటిని సైకిల్‌పై తీసుకువచ్చి చలివేంద్రంలో ఏర్పాటుచేసిన కుండల్లో పోసి అందరికీ అందిస్తాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ వంతుగా దానధర్మాలు చేసే స్థోమత లేకపోయినా వేసవికాలంలో రోడ్డుపై వెళ్లే ప్రయాణికుల దాహార్తిని తీర్చుతున్నామన్నారు. ప్రతి యేటా మార్చి, ఏప్రిల్, మే మూడు నెలల పాటు కంప్లి షుగర్ ఫ్యాక్టరీలో బస్టాండు పక్కన చలివేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు నీటి తొట్టెలను కూడా ఏర్పాటు చేసి మూగజీవులకు కూడా నీటిని అందిస్తున్నామన్నారు. ఈ మూడు నెలలు తమకు ఎంతో ముఖ్యమైనవన్నారు.



సైకిల్‌పైన బిందెలతో చలివేంద్రానికి నీరు తెస్తున్న తిప్పన్న

హోసూరు జోన్

విభిన్నప్రతిభావంతుల విహారయాత్ర



జెండా ఊపి యాత్రను ప్రారంభిస్తున్న కలెక్టర్ సరయు

హోసూరు(కృష్ణగిరి) మార్చి 14 : కృష్ణగిరి జిల్లా ఏలగిరికి ఒకరోజు విద్యా పర్యటనకు వెళుతున్న 40 మంది విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు మిఠాయిలు పంచి పెట్టి కలెక్టర్ కె.ఎం.సరయు వారి యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. పర్యాటక వాహనం వారి పర్యటనకు మార్గనిర్దేశం చేసింది. వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బర్గూరు ఐఈఎల్‌సీ మాన్స్ స్పెషల్ స్కూల్ ఆఫ్ మెంటల్లీ రిటార్డెడ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న కేంద్రం నుంచి, మదర్ అరబిందో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేంద్రం నుంచి 40 మంది శిక్షణ పొందుతున్న పిల్లలను ప్రత్యేక ఉపాధ్యాయులు, సంరక్షకులతో గురువారం ఏలగిరికి ఒకరోజు విద్యా పర్యటకు పంపారు. ఈ కార్యక్రమంల్లో కలెక్టర్ మాట్లాడుతూ వికలాంగులైన పిల్లల విద్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఈ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమాధికారి మురుగేవన్‌తో పాటు ఆ శాఖాధికారులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక పునరుద్ధరణకు విరాళం అందజేత

హోసూరు మార్చి 14: హోసూరులోని శ్మశాన వాటిక పునరుద్ధరణ, నిర్వహణ కోసం రూ.23లక్షలు కావలసి ఉండగా, హోసూరు రోటరీ సొసైటీ రూ.11.50 లక్షల చెక్కును మున్సిపల్ కమీషనర్‌కు అందించారు. రోటరీ క్లబ్ ఆఫ్ హోసూరు, రోటరీ పౌండేషన్ తరపున శ్మశానవాటిక పునరుద్ధరణ, నిర్వహణకు అవసరమైన 50 శాతం నిధులను అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో చెక్కును కార్పొరేషన్ కమీషనర్ స్నేహా అందుకున్నారు.

లారీ బోల్తా.. పత్తి మూటలు చెల్లాచెదురు..

హోసూరు (సిప్‌కాట్) మార్చి 14 : మహారాష్ట్ర నుంచి హోసూరు మీదుగా కోయంబత్తూరుకు పత్తి బేళ్ల లోడుతో వెళ్తున్న లారీ గురువారం సర్వీస్ రోడ్డు నుంచి జాతీయ రహదారిపైకి వచ్చే ప్రయత్నంలో రోడ్డు డివైడర్‌ను ఢీ కొని బోల్తా పడింది. ఈప్రమాదంలో లారీలోని పత్తి సంచులు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ ప్రమాదం కారణంగా హోసూరు బెంగళూరు జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. హోసూరు సిప్‌కాట్ ప్రాంతంలో కొత్తగా నిర్మిస్తున్న ఫ్లైవోవర్ పనుల కారణంగా ఈ సమస్య తరచుగా ఏర్పడుతోందని స్థానికులు అంటున్నారు.

ధర్మ సేవాసంఘం తరపున బస్ షెల్టర్ల ఏర్పాటు

హోసూరు మార్చి 14: హోసూరు సమీపంలోని బాగలూరు బస్టాండ్‌లో ప్రయాణికులకు షెల్టర్ లేక నానా ఇబ్బందులు పడేవారు. ఇది హోసూరు ప్రాంతంలో అతి ముఖ్యమైన ప్రాంతం కావడంతో సమీపంలోని వందకు పైగా గ్రామాల్లో రైతులు ఇక్కడి నుంచే రాకపోకలు జరపాల్సి ఉంటుంది. అలాగే హోసూరు నుంచి కర్ణాటక వెళ్లే మాలూరు రోడ్డులో అనేక కర్మాగారాలు ఉన్నాయి. ప్రైవేట్ పాఠశాలలు, రిసార్ట్‌లు , వివిధ పరిశ్రమలు కూడా ఉన్నాయి. ఈ ప్రాంతం నుంచి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రానికి బస్సులు తిరుగుతున్నాయి. ఇక్కడ కూర్చోవడానికి, నిలబడేందుకు నీడ లేకుండా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రయాణికులు కోరుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. దీంతో వంద మందికి పైగా హిందూ ధర్మ సేవా సంఘం సభ్యులు సొంత సొమ్ము రూ.1.20 లక్షలు వెచ్చించి ప్రయాణికులకు షెల్టర్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. ప్రజల కోసం గురువారం ప్రారంభించారు. చేశారు. కార్యక్రమంలో వంద మందికిపైగా హిందూ ధర్మ సేవాసంఘం సభ్యులు పాల్గొన్నారు.



బాగలూరులో ఏర్పాటైన బస్ షెల్టర్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న సంఘ సభ్యులు

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు గ్యారెంటీ ఇవ్వాలి



డీసీఎం డీకే శివకుమార్‌కు గదను బహూకరించిన కాంగ్రెస్ జిల్లా నాయకులు

రాయచూరు, మార్చి 14 : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గ్యారెంటీల అమలులో తమ ప్రభుత్వం నిబద్ధతను చాటుకుందని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. ఇచ్చిన మాటను నిలుపుకున్న ప్రభుత్వానికి మరో సారి ప్రజలు అండగా ఉండి లోక్‌సభ ఎన్నికల్లో గెలుపుపై గ్యారెంటీ ఇవ్వాలని అభ్యర్థించారు. గ్యారెంటీ పథకాల లబ్ధిదారులతో గురువారం నగరంలోని మహాత్మగాంధీ క్రీడా మైదానంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాభ్యుదయానికి రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం అనేక పథకాలకు శ్రీకారం చుట్టామన్నారు. మాన్వి తాలూకాలో తుంగభద్ర నదిపై రోడ్డు కం బ్యారెజీని నిర్మించడం ద్వారా ఈ ప్రాంత రైతులకు మరింత సాగు నీరందించేందుకు రూ.250 కోట్లకు పైగా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధపడిందన్నారు. అదే సమయంలో ప్రభుత్వం 371(జే) ద్వారా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందన్నారు. కల్యాణ కర్ణాటక అభివృద్ధి మండలి ద్వారా వేలకోట్ల రూపాయితో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సందర్భంగా ఆయన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇప్పటికే పూర్తైన వాటిని ప్రారంభించారు.

విద్యార్థులపైకి దూసుకెళ్లిన స్కూల్ బస్

● ఇద్దరు చిన్నారులకు తీవ్రగాయాలు

రాయచూరు, మార్చి 14: జిల్లాలోని సింధనూరు తాలూకా సాలగుందా గ్రామంలో ట్యూషన్ ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న ఇద్దరు విద్యార్థినులపై ప్రైవేటు పాఠశాల బస్సు ఒకటి దూసుకెళ్లింది. ఈ సంఘటన గురువారం ఉదయం చోటు చేసుకోగా ప్రమాదంలో విద్యార్థులిద్దరికి కాళ్లు విరిగి ఆర్తనాదాలు చేశారు. విద్యార్థుల కేకలు విన్న స్థానికులు పరుగెత్తుకుంటు వచ్చేసరికి ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ బస్సును అక్కడే వదలి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న సింధనూరు రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణమైన బస్సును స్టేషన్‌కు తరలించారు. అనంతరం తల్లిదండ్రులు విద్యార్థులిద్దరిని ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు. ఆస్పత్రి వద్ద విద్యార్థులను పరిశీలించిన రూరల్ ఎస్ఐ తల్లిదండ్రుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేస్తామని తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

మునిమాణిక్యం నరసింహారావు (జయంతి)



హాస్య రచయితగా గుర్తింపు పొందిన మునిమాణిక్యం నరసింహారావు 1898 మార్చి 15న గుంటూరు జిల్లా తెనాలి తాలూకా సంగం జాగర్లమూడి గ్రామంలో జన్మించారు. 20వ శతాబ్దం తొలినాళ్లలో కథకుడిగా రూపుదిద్దుకున్నారు. కుటుంబ జీవితంలోని కష్టసుఖాలు, దాంపత్య జీవితంలోని సౌందర్యం ఈయన కథలలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. భార్య ప్రేరణతో ఆయన రచించిన 'కాంతం కథలు' తెలుగు కథాసాహిత్యంలో ఒక మణిపూస. ఆయన కుమారుడు రఘునాథ యాజ్ఞవల్క్య కూడా రచయితగా రాణించారు. నరసింహారావు హాస్యరచయిత మాత్రమే కాదు హాస్యపోషకులు కూడా. 1973 ఫిబ్రవరి 4న కన్నుమూశారు.

జూలియస్ సీజర్ (వర్ధంతి)



రోమన్ మిలిటరీ అధికారి, రాజకీయనేతగానే కాకుండా ల్యాటిన్ గద్యంలో ప్రముఖ రచయితగా రాణించిన గయస్ జూలియస్ సీజర్ (క్రైజర్) క్రీస్తు పూర్వం 100 జూలై 12న జన్మించారు. రోమన్ రిపబ్లిక్‌ను రోమన్ సామ్రాజ్యంగా విస్తరింప చేయడంలో కీలకంగా వ్యవహరించారు. పాలనలో సంస్కరణలు తెచ్చి తనదైనముద్రను చాటారు. క్రీస్తుపూర్వం 44 మార్చి 15న ప్రత్యర్థుల చేతిలో హతమయ్యారు.

జిన్సన్ జాన్సన్ (పుట్టినరోజు)



అథ్లెటిక్స్‌లో అర్జున పురస్కార గ్రహీత, 'నాయిబ్ సుబేదార్' హోదాలో కొనసాగుతున్న జిన్సన్ జాన్సన్ 1991 మార్చి 15న కేరళ రాష్ట్రం కోజికోడ్ జిల్లాలో జన్మించారు. ఇండియన్ ఆర్మీలో 2009 నుంచి జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ (జేసీఓ)గా వ్యవహరిస్తున్నారు. 800, 1500 మీటర్ల పరుగు పందెంలో మిడిల్ డిస్టన్స్ రన్నర్‌గా రాణించారు. 2016 సమ్మర్ ఒలింపిక్స్‌లో పాల్గొన్నారు. 2018 కామన్వెల్త్‌గేమ్స్‌లో 1500మీటర్ల విభాగంలో జాతీయ రికార్డు నెలకొల్పారు. 2018 ఏషియన్‌గేమ్స్‌లో 1500మీటర్ల పురుషుల విభాగంలో బంగారుపతకం, 800 మీటర్ల విభాగంలో రజతపతకం సాధించారు. 2022 హాంగ్‌జౌలో 1500 మీటర్ల విభాగంలో కాంస్య పతకం సాధించారు.

అలియాభట్ (పుట్టినరోజు)



బాలీవుడ్‌లో పేరొందిన ప్రముఖ నటి అలియాభట్ 1993 మార్చి 15న ముంబైలో జన్మించారు. సినిమా దర్శకుడు మహేశ్‌భట్, నటి సోని రజ్దాన్‌ల కుమార్తె. బాలనటిగా 1999లో హిందీ సినిమా 'సంఘర్ష్'తో తెరంగేట్రం చేశారు. అనంతరం 2012లో 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' సినిమాతో హీరోయిన్‌గా గుర్తింపు పొందారు. కొన్ని పాటలు కూడా పాడారు. 2019 నాటికి అత్యధిక రెమ్యూనరేషన్ నటీమణులలో ఒకరిగా నిలిచారు. 4 ఫిల్మ్‌ఫేర్ ఇతర పురస్కారాలు పొందారు. పలు రకాల ఉత్పత్తులకు, బ్రాండ్‌లకు రాయబారిగా కొనసాగుతున్నారు. నటుడు రణబీర్‌కపూర్‌ను పెళ్లి చేసుకున్నారు. 2022లో టైమ్ 100ఇంపాక్ట్ అవార్డు పొందారు.

మౌలిక సదుపాయాలు కల్పించకపోతే ఎన్నికల బహిష్కరణ

● ఎన్నికల వేళే గుర్తొస్తామా..? ● చామరాజనగర్ జిల్లా ఇండిగనత్త గ్రామస్థుల నిరసన

బెంగళూరు, మార్చి14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందుగానే మౌలిక సదుపాయాలు కల్పించకుంటే ఓట్లు వేసేది లేదనే నిరసనలు ప్రారంభమయ్యాయి. చామరాజనగర్ జిల్లా హనూరు తాలూకా ఇండిగనత్త గ్రామప్రజలు గురువారం మూకుమ్మడిగా నిరసనకు దిగారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు ముగిసినా తమ పల్లెకు పక్కా రోడ్డు లేదని, తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని కనీస సౌకర్యాలు సమకూర్చకపోతే లోక్‌సభ ఎన్నికలలో ఓట్లు వేసేది లేదని తేల్చి చెప్పారు. మా గ్రామానికి ఓట్లు అడిగేందుకు ఏపార్టీకి చెందినవారు రాకూడదని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో రెండు ప్రధాన పార్టీలు ఉన్నాయని ఇందులో కాంగ్రెస్ రాష్ట్రంలోను బీజేపీ కేంద్రంలోను ప్రభుత్వాలు కొనసాగిస్తున్నవే అన్నారు. గ్రామానికి చెందిన పుట్ట తంబడి అనే వ్యక్తి మాట్లాడుతూ గ్రామానికి రోడ్డు లేదని, విద్యుత్ దీపాలు లేవని, తాగునీటికి ఇబ్బంది పడుతున్నామన్నారు. ఎన్నికల వేళ వచ్చే ప్రజాప్రతినిధులు, పార్టీల ముఖ్యులు ఆతర్వాత మరచిపోతున్నారని మండిపడ్డారు. ఎంతోకాలంగా ఓపిక పట్టామని మేం ఓట్లు వేసేందుకు మాత్రమే పనికి వస్తామా అంటూ మండిపడ్డారు. ఒకప్పుడు ప్రైవేటు జీపులు వచ్చేవని అటవీశాఖ నిబంధనలతో రద్దు చేశారన్నారు. గతంలో అధికారులు, మంత్రులు ఇచ్చిన హామీలను పరిష్కరించలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన రేషన్‌కార్డులు, ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులను వాపసు తీసుకుని సామూహికంగా మృతి చెందేందుకు విషం ఇవ్వాలని మండిపడ్డారు. లేదంటే పోలింగ్ తేదీలోగా సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రజాప్రతినిధుల తరహాలోనే అధికారులు తప్పించుకునేలా వాగ్దానాలు చేస్తున్నారని మండిపడ్డారు. మహదేశ్వర కొండ ప్రాంతంలోని పలు గ్రామాల ప్రజలు ఎన్నికలను బహిష్కరిస్తామని సవాల్ చేస్తున్నారు.



ఆందోళనలో ఇండిగనత్త గ్రామస్థులు



నియామక పత్రం అందజేస్తున్న డీకే..

బాలభవన్ సొసైటీ అధ్యక్షుడిగా బీఆర్ నాయుడు

బెంగళూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్త్రీ శిశు సంక్షేమ శాఖ పరిధిలోకి వచ్చే బాలభవన్ సొసైటీ అధ్యక్షుడిగా ప్రముఖ సమాజ సేవకుడు బీఆర్.నాయుడు నియమితులయ్యారు. బెంగళూరు కబ్బన్‌పార్కులో ఉన్న ఈ సొసైటీకి రెండేళ్లపాటు ఆయన సేవలందించనున్నారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డికె.శివకుమార్ గురువారం బీఆర్ నాయుడికి నియామక పత్రం అందజేసి అభినందించారు. తనను ఈ పదవిలో నియమించిన సీఎం, డీసీఎంలకు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సేవలందించేందుకు ఏ పదవి అయినా గొప్పదేనన్నారు. బాలల వికాసం కోసం కృషి చేస్తానని బాలభవన్‌ను మరింతగా ఆధునికీకరించే అంశంపై దృష్టి సారిస్తానన్నారు.

స్టార్టప్‌లను స్థాపించేలా విద్యార్థులు ఎదగాలి

● పీఈఎస్ యూనివర్సిటీలో ఉద్యమశీలత సదస్సులో ప్రోచాన్సిలర్



సదస్సును ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ జవహర్ దొరస్వామి తదితరులు

బెంగళూరు, మార్చి14 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఎంబీఏ వంటి కోర్సుల విద్యార్థులు ఉద్యోగాల కోసం అన్వేషణ కాకుండా స్టార్టప్‌లను ఆరంభించేదిశగా ఆలోచించాలని పీఈఎస్ యూనివర్శిటీ ప్రో ఛాన్సలర్ ప్రొఫెసర్ జవహర్ దొరస్వామి అభిప్రాయపడ్డారు. గురువారం యూనివర్శిటీలో ఎంట్రప్యూనర్‌షిప్, ఫ్యామిలీ బిజినెస్ అంశాలపై సదస్సు జరిగింది. విద్యార్థులు, పారిశ్రామిక, విద్యానిపుణులు అధ్యాపకులను ఉద్దేశించి ప్రొఫెసర్ జవహర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక సదస్సులు, పారిశ్రామిక నిపుణుల సదస్సులలో భాగస్వామ్యులు కావాలన్నారు. ఆధునిక సమాజంలో స్టార్టప్‌ల భూమిక కీలకమవుతోందన్నారు. యూనివర్శిటీలోనే స్టార్టప్‌ల కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. పరిశోధనలు ఆవిష్కరణలకు అనుకూలత కోసమే ఏర్పాటు చేశామన్నారు. వైస్‌ఛాన్సలర్ డాక్టర్ జే సూర్యప్రసాద్ మాట్లాడుతూ పీఈఎస్ విద్యార్థులకు ప్రపంచస్థాయి పేరొందిన కంపెనీలలో ఏటా ఉద్యోగాలు సాధ్యం అవుతున్నాయన్నారు. విద్యార్థులు ఉత్తమ జీవనాన్ని సఫలీకృతం చేసుకోవాల్సి ఉందని పిలుపునిచ్చారు. ఎనకేపీ ఎంపైర్ వెంచర్స్ సంస్థ సీఈఓ శాకీర్ హక్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు కుటుంబపర వ్యాపారాలలో స్థిరపడాలని అనుకున్నా వాటికి సాంకేతికతను జోడించాలన్నారు. ఎంపైర్ హోటల్‌లు ఒకప్పుడు చిన్న శాఖగా ఏర్పడి నేడు బెంగళూరులోనే ప్రముఖంగా రాణించేలా తీర్చేందుకు నాణ్యత, గుణాత్మకతను సుదీర్ఘంగాను కొనసాగించడమే కారణమన్నారు. మేనేజ్‌మెంట్ విభాగం డీన్ డాక్టర్ శైలశ్రీ హరిదాస్ సదస్సు ముఖ్యాంశాలను వివరించారు. విద్యార్థులలో పారిశ్రామిక ఆలోచనలు, సాంకేతికతలకు అనుగుణంగా పరిశోధనలు ఆవిష్కరణలు సాధించేలా ఏర్పాటు చేశామన్నారు.

బీజేపీలోకి కాంగ్రెస్‌నేత బాబూ రావ్ చవాన్



మాజీమంత్రి బాబూరావ్‌చవాన్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ నాయకులు

బెంగళూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ అయారాం గయారాంల హడావుడి ప్రారంభమైంది. బెంగళూరు మల్లేశ్వరంలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో గురువారం కలబురిగి జిల్లాకు చెందిన ప్రముఖ కాంగ్రెస్ నేత మాజీ మంత్రి బాబారావ్ చవాణ్ తన మద్దతు దార్లతో కలిసి లాంఛనంగా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనతో పాటు బైలహొంగల మాజీ ఎమ్మెల్యే విశ్వనాథ్ పాటిల్, జగళూరు మాజీ ఎమ్మెల్యే హెచ్‌పి.రాజేష్, శిగ్గాంవ్‌కు చెందిన శశిధర్ యలిగార్‌లు కూడా బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ నేతలందరికీ కాషాయం కండువా కప్పి పార్టీ పతకాలను అందజేసి లాంఛనంగా ఆహ్వానించిన పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బివై.విజయేంద్ర అనంతరం మీడియాతో మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు చెందిన మరింత మంది నేతలు బీజేపిలో చేరనున్నట్లు చెప్పారు. పార్టీని బలోపేతం చేసేందుకు వీరి సేవలను వినియోగించుకుంటామన్నారు. ప్రతిపక్ష నేత ఆర్.అశోక్, పార్టీ ఎంపీ జీఎం.సిద్ధేశ్వర్, సీనియర్ నేత సిటీ.రవి తదితరులు ఈ సందర్భంగా హాజరయ్యారు.

ప్రధాని మోదీ సమక్షంలోనే చేరతాం..

కాగా మల్లేశ్వరంలోని బీజేపీ ప్రధాన కార్యాలయానికి మైసూరు యువరాజు యదువీర వచ్చినా ఆయన పార్టీలో మాత్రం చేరలేదు. ప్రధాని నరేంద్రమోదీ సమక్షంలోనే పార్టీలో చేరుతానని ఆయన స్పష్టంచేశారు. కాగా ప్రముఖ హృద్రోగ నిపుణుడు డా. సిఎన్.మంజునాథ్ కూడా ఇదే విధమైన సందేశాన్ని పార్టీ నేతలకు పంపినట్లు తెలుస్తోంది. ప్రధాని ఈ నెల 16న కల్బుర్గిలోనూ 18న శివమొగ్గలోనూ జరిగే పార్టీ బహిరంగ సభల్లోపాల్గొననున్న నేపథ్యంలో వీరు ఏదో ఒక సభలో లాంఛనంగా పార్టీ తీర్థం పుచ్చుకునే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

సబ్‌ఇన్‌స్పెక్టర్‌కు లైంగిక వేధింపులు.. తోటి ఎస్ఐ అరెస్ట్

బెంగళూరు, మార్చి14 (ఆంధ్రజ్యోతి): మహిళా సబ్‌ఇన్‌స్పెక్టర్‌కు లైంగికంగా వేధింపులకు గురిచేసిన మేరకు కర్ణాటక స్టేట్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీఫోర్స్ (కేఎస్ఐఎస్ఎఫ్) సబ్‌ఇన్‌స్పెక్టర్‌ను అరెస్టు చేశారు. కేఎస్ఐఎస్ఎఫ్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా వ్యవహరించే సంజయ్ అరెస్టు అయినవారు. 28ఏళ్ళ సహ ఉద్యోగి సబ్‌ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు గురువారం ఎస్ఐ సంజయ్‌ను అరెస్టు చేశారు. శిక్షణ పొందేవేళ వారిద్దరికీ పరిచయం ఏర్పడింది. తొలుత సంజయ్ ప్రేమను వ్యక్తం చేయగా ఆమె తిరస్కరించారు. ఆతర్వాత గ్రూప్ పరీక్షలు రాస్తున్నానని చదువుకునేందుకు సాయం చేయాలని సంజయ్ కోరారు. ఇదే కారణంతోనే సంజయ్ మరోసారి ఆమెకు దగ్గరయ్యారు. మిత్రులుగా కొనసాగుతున్న తరుణంలో తీసుకున్న ఫొటోలతో సంజయ్ బ్లాక్‌మెయిల్‌కు యత్నించారు. లైంగికంగా దౌర్జన్యాలకు పాల్పడే యత్నం చేశారు. తిరస్కరిస్తే కిడ్నాప్ చేసి తాళికడతానని బెదిరించినట్లు బాధిత మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రాలేఅవుట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఎస్ఐ సంజయ్‌ను అరెస్టు చేశారు.

జేడీఎస్ సరిలేదనే మంజునాథ్ బీజేపీలోకి..: డీకే

బెంగళూరు, మార్చి14 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్ పార్టీ సరికాదనే డాక్టర్ మంజునాథ్ బీజేపీలోకి చేరుతున్నారని బెంగళూరు గ్రామీణ కాంగ్రెస్ అభ్యర్థి డీకే సురేష్ ఎద్దేవా చేశారు. బెంగళూరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేవేగౌడ కుటుంబంలోని వ్యక్తి మంజునాథ్ అన్నారు. జేడీస్ బాగాలేదనే కారణంతోనే జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవేగౌడ అల్లుడే మరో పార్టీలో చేరారన్నారు. మంజునాథ్ రాజకీయాలలోకి రావడాన్ని సాదరంగా స్వాగతిస్తామన్నారు. రాజకీయ నేతను అదే కోణంలోనే చూడాలన్నారు. దేవేగౌడ కుటుంబానికి చెందినవారు బీజేపీ నుంచి ఎందుకు పోటీ చేస్తున్నారని ప్రశ్నించారు. దేవేగౌడ, కుమారస్వామిల పార్టీ సరిగా లేదనే మేథావిగా అల్లుడు నిర్ణయం తీసుకుని ఉండవచ్చు అన్నారు. మంజునాథ్ అభ్యర్థి కావడం నాకు ఎటువంటి ఆశ్చర్యం లేదన్నారు. ప్రత్యర్థి ఎవరైనా పోటీలో వెనకడుగు ఉండదన్నారు. ఎవరితోనైనా పోటీకి సిద్ధమని ధీమా వ్యక్తం చేశారు.

ఐసీఏఐ సీఏలో 65 శాతం ఉత్తీర్ణత సాధించిన ఐఐసీ లక్ష్య

బెంగళూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ)2023 డిసెంబరులో నిర్వహించిన సీఏ పరీక్షల ఫలితాలు వెలువడ్డాయి. జాతీయ స్థాయిలో 29.99 శాతం ఉత్తీర్ణతా శాతం నమోదు కాగా ఐఐసీ లక్ష్య 65 శాతం ఉత్తీర్ణతను సాధించింది. ఈ మేరకు సంస్థ నగరంలో గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఈ పరీక్షలకు 1,37,153 మంది హాజరు కాగా ఇందులో 41,132 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌కామర్స్ లక్ష్య తరుపున 1131 మంది అభ్యర్థులు హాజరుకాగా ఇందులో 65 శాతం అటే 727 మంది ఉత్తీర్ణత సాధించారు. ఏప్రిల్ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని సంస్థ వెల్లడించింది.

లాభాల డివిడెండ్‌ను సీఎంకు అందజేసిన కేఎస్ఐఐడీసీ

బెంగళూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక స్టేట్ ఇండస్ట్రియల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ (కేఎస్ఐఐడీసీ) 2022-23 సంవత్సరానికి గాను తన నికర లాభాల్లో 30 శాతం డివిడెండ్‌ను ప్రకటించింది. ఇందులో ప్రభుత్వ వాటా డివిడెండ్ చెక్కు రూ 19.84 కోట్లను భారీ పరిశ్రమల శాఖా మంత్రి ఎంబి పాటిల్ గురువారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు అందజేశారు. ఈ సంస్థలో 10 రూపాయల ముఖ విలువ చేసే 69.47 కోట్లకు పైగా ప్రభుత్వ షేర్లు ఉన్నాయి. 2022-23 నాటికి ఈ షేర్ల విలువ ఏకంగా రూ694.70 కోట్లకు చేరుకుంది. ఈ నెల 20న జరిగిన కెఎస్ఐఐడిసి బోర్డు సమావేశంలో 30 శాతం డివిడెండ్‌ను ప్రకటించారు. ముఖ్యమంత్రికి చెక్కు అందజేసే కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



సీఎం సిద్ధరామయ్యకు చెక్కు అందజేస్తున్న మంత్రి ఎంబీ పాటిల్

విద్యార్థి దశలోనే పరిశోధనలను ప్రోత్సహించాలి

● జైన్ డీమ్డ్ వర్సిటీ చాన్సిలర్ రాజ్‌సింగ్

బెంగళూరు, మార్చి14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే పరిశోధనలకు ప్రోత్సహించాలని జైన్ డీమ్డ్ యూనివర్శిటీ చాన్సిలర్ డాక్టర్ రాజ్‌సింగ్ అభిప్రాయపడ్డారు. బనశంకరిలోని బీఎన్ఎంఐటీ కళాశాలలో మేధోసంపత్తి హక్కులు అనే అంశంపై గురువారం సదస్సు జరిగింది. విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి రాజ్‌సింగ్ మాట్లాడుతూ పరిశోధనలు విద్యార్థి దశ నుంచే అలవడితే మరిన్ని సాధనలు సమాజానికి అనుకూలం అవుతాయన్నారు. దేశంలో పరిశోధకులు సంఖ్య మరింత పెరగాల్సి ఉందన్నారు. అమెరికాలో మిలియన్ మందికి 4452ల మంది చైనాలో 6500ల మంది ఉన్నారన్నారు. భారత్‌లో కేవలం 250ల మంది మాత్రమే ఉన్నారన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలోకి చేరాలంటే కేవలం ఆర్థికతతో మాత్రమే కాదని పరిశోధనలు, ఆవిష్కరణలు కీలకమే అన్నారు. కళాశాలలో విద్యతో పాటు పార్శ్యాంశాలకు సంబంధించిన అనుబంధమైన అంశాలపై పరిశోధనలు జరిపించాలన్నారు. అప్పుడే మరిన్ని స్టార్టప్‌లు సాధ్యమన్నారు. దేశంలో పరిశోధనలకు 50-70 శాతం పెరగాల్సి ఉందన్నారు. తొలి సెమిస్టర్ నుంచే పరిశోధనలు ఆరంభించేలా ప్రోత్సహించాలన్నారు. విగ్రో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ రమేష్‌చంద్ర పాండే, బీఎన్ఎంఐటీ ట్రస్టు సభ్యులు ఈశ్వర్ ఎన్ మానే, అధ్యక్షులు నారాయణ రావ్ మానే కళాశాల అడిషనల్ డైరెక్టర్ ఎస్‌వై కులకర్ణి, ప్రొఫెసర్ టీజే రామమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీఎన్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న చాన్సిలర్ రాజ్‌సింగ్, ట్రస్టు సభ్యులు

కల్యాణకర్ణాటక వాసులకు 50వేల ఉద్యోగాలు

● వైద్యవిద్య శాఖామంత్రి శరణప్రకాష్ పాటిల్



బెంగళూరు, మార్చి14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలోనే 371జే ఆర్టికల్ అమలులోకి వచ్చిందని వెనుకబడిన కళ్యాణ కర్ణాటక పరిధికి చెందిన వారికే 50వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని వైద్యవిద్య, నైపుణ్యాభివద్ధి శాఖా మంత్రి డాక్టర్ శరణప్రకాష్ పాటిల్ అభిప్రాయపడ్డారు. కలుబురిగిలో గురువారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఐదు గ్యారెంటీల ద్వారా రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి ప్రోత్సాహం లభిస్తోందన్నారు. కళ్యాణకర్ణాటక పరిధిలో ఖాళీగా ఉండే ఉద్యోగాల భర్తీకి స్థానికులనే ఎంపిక చేస్తామన్నారు. ఇప్పటికే వివిధ శాఖలలో 15వేల పోస్టుల నియామకపు ప్రక్రియ ఆరంభమైందన్నారు. రానున్న రెండుమూడేళ్ళలోనే అన్ని పోస్టులను భర్తీ చేస్తామన్నారు. 2022 డిసెంబరులో కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఐదువేల కోట్ల గ్రాంట్‌లు తీసుకువస్తామని ప్రకటించారని అందుకు అనుగుణంగానే సీఎం సిద్దరామయ్య అమలు చేస్తున్నారన్నారు. ఖర్గే నేతృత్వంలోనే కలబురగికి జయదేవ ఆసుపత్రికి, కిద్వాయ్ ఆసుపత్రి, తల్లీబిడ్డల ప్రత్యేక ఆసుపత్రి, జిమ్స్ ఆసుపత్రి, ట్రామా సెంటర్‌లను అభివృద్ధి చేశామన్నారు. కలుబురిగి నగరాన్ని మెడికల్ హబ్‌గా మార్చామన్నారు. కలబురిగి అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు.

ఖదీమ టీజర్ విడుదల

చందనసీమలో నూతన తారల ఎంట్రీ ఇటీవలి కాలంలో పెరుగుతోంది. ఇలా కొత్తనటీనటులతో క్వాలిటీతో పాటు బోలెడు కంటెంట్‌ను సమకూర్చుకుని ఖదీమ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులను పూర్తిచేసుకుని దాదాపు విడుదలకు సిద్ధంగాఉంది. ఇందులో భాగంగా నగరంలో చిత్రం టీజర్‌ను లాంచనంగా విడుదల చేశారు. ఈ చిత్రాన్ని టి.శివకుమారన్ నిర్మించగా సహ నిర్మాతగా యశస్విని తోడ్పాటునందించారు. దర్శకుడు సాయి ప్రదీప్ మీడియాతో మాట్లాడుతూ త్వరలోనే సినిమా ఆడియో, ట్రైలర్‌ను కూడా విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. ఆబాల గోపాలంచూడదగ్గ అద్భుతమైన సినిమాగా దీన్ని రూపొందించామన్నారు. జిమ్ ట్రైనర్‌గా ఉన్న చందన్ సిక్స్‌ప్యాక్‌లో ఈ సినిమాలో టైటిల్ రోల్‌ను పోషించారు. హీరోయిన్‌గా అనూషా నటించారు. శోభారాజ్, మిమిక్రీ దయానంద్, గిరిజా లోకేష్, వంటి సీనియర్ నటులు ఇతర ప్రముఖ పాత్రలను పోషించారు. సంగీతాన్ని శశాంక్ శేషగిరి అందించారు. బెంగళూరు చుట్టు పక్కల ప్రాంతాలలో చిత్రీకరణ జరిపారు. ప్రత్యేకించి ఒక పాట సన్నివేశాన్ని సిటీ మార్కెట్‌లో చిత్రీకరించారు. కేరళలో కూడా ఒక పాటను చిత్రీకరించామని దర్శకుడు సాయి ప్రదీప్ వెల్లడించారు.



చిత్ర యూనిట్

కుబేర ఫస్ట్ లుక్ విడుదల

జాతీయ పురస్కార గ్రహీత ధనుష్, హీరోయిన్ రష్మికా మందణ్ణ జంటగా కొత్త సినిమాకు టైటిల్ ఎట్టకేలకు ఖరారైంది. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించనున్న ఈ సినిమా టైటిల్ మహాశివరాత్రి రోజే విడుదల కావడం మరో విశేషం. కుబేరలో ధనుష్ బిక్షకుని పాత్రలో కనిపించడంతో సినిమాపై క్రేజ్ ప్రారంభమైంది. శివపార్వతుల ముందు నిలబడి ఉన్న ఈ తొలి దృశ్య సోషల్ మీడియాలో భారీగా వైరల్ అవుతోంది. ఫిదా, లవ్‌స్టోరీ, తదితర హిట్ చిత్రాలను అందించిన జాతీయ పురస్కార గ్రహీత శేఖర్ కమ్ముల దర్శకత్వంలో శ్రీవెంకటేశ్వర సినిమాస్, ఒమిగోస్ క్రియేషన్స్ పతాకంపై సునిల్ నారంగ్, పుస్కుర్ రామమోహన్‌రావు చిత్రాన్నినిర్మిస్తున్నారు. అక్కినేని నాగార్జున, జిమ్ సర్ఫ్ తదితర తారాగణం ఇంతవరకు ఎంపికైంది. ఇతర నటీనటుల ఎంపిక ఇంకా జరుగుతోంది. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద సంగీతాన్ని అందిన్న ఈ పాన్ ఇండియా సినిమాకు త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుందని నిర్మాతలు నగరంలో గురువారం మీడియాకు చెప్పారు. చక్కటి కథతో అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఈ సినిమా ఉంటుందన్నారు. అం దమైన లోకేషన్లలో చిత్రీకరణ జరిపేందుకు సన్నాహాలు చేసుకుంటున్నామని తెలిపారు. హీరో ధనుష్‌కు ఇది 51వ సినిమా కావడం మరో విశేషం.



భిక్షకుని పాత్రలో ధనుష్

దీపావళికి విడుదల కానున్న ఫైర్ ఫ్లై

చందనసీమలో సెంచరీ స్టార్ డా.శివరాజ్‌కుమార్ కుమార్తె నివేదిత శివరాజ్‌కుమార్ శ్రీముత్తు సినీ సర్వీసెస్ పతాకంపై నిర్మించిన ఫైర్ ఫ్లై సినిమా దీపావళి పండుగ నాటికి సన్నద్ధం కానుంది. ఈ సినిమా విశేషాలను బెంగళూరులోని శివరాజ్‌కుమార్ నివాసంలో చిత్రం యూనిట్‌సభ్యులు మీడియాతో పంచుకున్నారు. ఈ సందర్భంగా నిర్మాత నివేదిత మాట్లాడుతూ వెబ్ సిరీస్‌లకు మంచి స్పందన లభించడంతో సినిమా నిర్మించాలన్న ఆసక్తి పెరిగిందని దర్శకుడు వంశీ కథ చెప్పడంతో బాగా నచ్చిందన్నారు. మంచి టెక్నికల్ టీమ్‌తో సినిమాకు కొత్తరూపమిచ్చామన్నారు. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉందన్నారు. నటుడు, దర్శకుడు వంశీ మాట్లాడుతూ అందరి జీవితంలోనూ ఒక టర్నింగ్‌పాయింట్ ఉంటుందని డెడ్ ఎండ్ అనుకున్న తరుణంలో ఒక చిన్న ఆశ, ఒక చిన్న మోటివేషన్ జీవితాన్ని కొత్తమలుపు తిప్పుతుందన్నారు. ఈ చిత్రంలో వంశీ హీరోగానటిస్తున్నారు. వంశీకి పూర్తిస్థాయి డైరెక్టర్‌గా ఇది తొలి చిత్రం కావడం మరో విశేషం. చిత్రానికి చరణ్‌రాజ్ సంగీతాన్ని సమకూర్చారు. రఘు నిడువళ్ళి సంభాషణలను సమకూర్చారు. ఈ సినిమా విజయవంతం కావాలని డా.శివరాజ్‌కుమార్, గీతా శివరాజ్‌కుమార్ ఆకాంక్షిస్తూ కుమార్తె నివేదితకు శుభాకాంక్షలు అందజేశారు.



కుమార్తెతో డాక్టర్ శివరాజ్‌కుమార్ దంపతులు

నేడు వెండితెరపైకి సోము సౌండ్ ఇంజనీర్

కన్నడ చిత్రరంగంలో మరో విభిన్నటైటిల్‌తో సోము సౌండ్ ఇంజనీర్ సినిమా ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రం యూనిట్ గురువారం మీడియాతో తమ అనుభవాలను పంచుకుంది. బలమైన కథతో రూపుదిద్దుకున్న ఈ సినిమా ట్రైలర్ నగరంలో విడుదలైంది. సినీ రంగ ప్రముఖులు సుక్క సూరీనాథ్, డాలి ధనుంజయ్ ట్రైలర్‌ను విడుదలచేసి చిత్రం యూనిట్‌ను అభినందించారు. దర్శకుడు అభి మాట్లాడుతూ తన గురువు సూరీ ఆశీస్సులో చిత్రాన్ని ప్రారంభించానని సినిమా తాము ఊహించినదానికంటే చాలా బాగా వచ్చిందన్నారు. హీరో శ్రేష్ఠ హీరోయిన్ శృతి పాటిల్ కూడా ఇదొక భిన్నమైన సినిమాగా ప్రేక్షకుల ఆదరణ చూరగొనడం ఖాయమన్నారు. సినిమాలో జహంగీర్, అపూర్వ, యష్ శెట్టి, ప్రముఖ పాత్రలను పోషించారు. క్రిష్టోఫర్ కిణి ఈ సినిమాను నిర్మించారు. సోము సౌండ్ ఇంజనీర్ సినిమా యూనిట్ మొత్తం మీడియా సమావేశంలో పాల్గొంది.